


# రోజులు మారిపోయేయి

## - దేశిరాజు

### (ఆంధ్రవాణి - 1950 జనవరి 29 సంచికనుంచి పునర్ముద్రితం)

నేను యిక్కడకు వచ్చేక ఓ పెద్ద జాబు వ్రాద్దాం అనుకుంటూ అశ్రద్ధ చేసేను. ఇలా వుత్తరాలు రాయడం నాకు అలవాటు. అలా అంటే అనుమానం పడుతావు. అంతగా ప్రేమించే నా హృదయాన్ని 'విధి' నిరాశ చేసింది. ఎట్లాగో ఆటంకాన్ని కలిగించింది. ఆ ఆశ మటుకు నాలో నాటుకు పోయింది.

వసంతకాలంలో చిగిర్చిన ప్రతీ ఆకూ ఆమె సందేశం యిస్తూనే వుంటాయి. లేచిన అల విరిగి బీచిమీద పడ్డప్పుడల్లా ఏదో జ్ఞాపకం వస్తుంది. ఏదైనా అంటే ఎత్తిపొడుపుగా 'పెళ్ళి చేసుకున్నావుగా' అంటావు. ఈ చాకిరి, పడకగది, తలచుకుంటే ఏడ్పు. ముక్తిలేని సాధనాలు కదా అని తలపుకు వస్తుంది.. ఊరికే కారణం లేకుండా జరిగిన సంగతులు, తెలిసిన మధ్య తటాలున జ్ఞాపకానికి వచ్చి, ఎండలో మబ్బులో చెట్లగాలిలో ఆ పోలిక గలిగి సిగ్గుపెట్టి, బాధిస్తాయి. ప్రేమలో ఈ అసాధారణ సంఘటనలు కలగటం, ప్రజాలోకాన్ని బాధ పెట్టడానికే కాబోలు.

ఆ దినాలు ఒక పెద్దపేజీలా తిప్పి వేశాం. యివి కొత్తదినాలు. ఆ విస్మృతులు మాత్రం ఆ రోజా దినాలు వెళ్ళిపోయాయి– మనం తలుచుకొన్న కొద్దీ యీ గడుస్తున్న గడ్డుదినాలు కూడా కొన్ని ఏళ్ళ తరువాత మధురంగా కనిపిస్తాయి అందుకని కలలుకంటూ వుండకూడదు.

నాకు ఒంటరితనం అలవాటు. ఒక్కడ్నీ ఎంత దూరమైనా వెళ్ళిపోగలను అంచేత తోచని సందేహాలు, సందేశాలు కనబడుతాయి. ఒంటరిగా గడపడం స్త్రీ సౌందర్యం వృథాపోనిచ్చినట్టే అని నవ్వుతూ ఓమారు మధ్య అన్నావు, నిజమేనేమో?

మన నేస్తం అదోరకమయింది – అణా పైసలు లెక్కపెట్టుకున్నాం. యిక ఆ రోజులుండకూడదు. ఆలోచిస్తే చాలా 'సిల్లీ'గా కనబడుతుంది కదూ!

ఆ గోదావరిలో చిన్న చిన్న నావలు బేడకో అర్థకో తీసుకొని నదిలో ప్రయాణం చేసిన దినాలు, కొవ్వూరులోకి పోయి నావొడ్డున పడేసి పొద్దున్న మళ్ళీ నావోడు తిడుతుంటే వింటూంటే ఆదో హాయి.

అన్నీ తలచుకుంటే జీరోపాయింట్ కే వస్తాం. నిద్రలో రాజుకీ జోగికీ బేధం లేనట్టే. జమిందారు అయినా కిందా మీదా పడాలి పిల్లలకోసం. కాని సామాన్య మానవులకు 'కామన్ మెన్' కి ఈ భ్రమలు చాలా అనవసరం కదూ.

మన జీవితపు విలువ, మనం దినం ఆచరించే పనుల 'క్వాలిటీ' మీద ఆధారపడి వుంటుంది. ఒక్క నిముషం నిశ్చింతగా ఈ చాకిరీ వదిలి, పిల్లలూ, చెట్లూ, ఆకాశాన్ని, సముద్రాన్ని, చూసేందుకు అవకాశం యిస్తే, మనస్సుకు ఎంతో హాయినిచ్చేవాళ్ళం అవుతాం.

ప్రాతఃకాలం శాస్త్రుల్లు యింట్లో పనస తొనలు దొంగలించి ముఖం కడగటం మాని తిన్న రోజులు, అట్లతదియకు ఆడపిల్లల ఆ పరికిణీ జాకట్టు అందం చూస్తూ తెలియని రోజుల్లో గడిపిన దినాలు, మచ్చుకయినా రావు మరి– నూనుగు మీసం మొగ అందంకి, పరికిణీ బాడీ అమ్మాయికి అందాన్ని పురికొల్పుతాయి, ఉసి కొల్పుతాయి మనకేం తెలుస్తుంది. ఆ స్వప్న దినాల్లో ప్రపంచం అందాన్ని వాళ్ళు దాచేస్తారని. మారు పేర్లు పిల్చే దినాలు ఓ థ్రిల్ యిచ్చేవి కూడా.

స్వతంత్రప్రాప్తి అయ్యాక ప్రతీవారు సంతోషాన్ని పొందలేక పోవడం మన దురదృష్టమేమో కాని నమ్మకాల విషయంలో మనం చాలా ఆరితేరేమని చెప్పచ్చు – ‘మధుర’ లో ఎంతో చక్కగా గత స్వతంత్ర దినం జరిగిందని చదివేను – మీనాక్షి దేవాలయ ఆవరణలో నూటొక్క దీపాలతో అమర్చబడి లక్ష అర్చనలు జరిగేయి. అవన్నీ ఆ పురాతన గ్రామంలో ప్రజలు ఆనందంగా నిశ్చింతగా వుత్సవం చేసుకున్నారంటే ఎంతో సరదా వేసింది.

గుళ్ళో నాగస్వరం, చల్లని గాలి, తోటలో మిడుతలు, సంపూర్ణమయిన తృప్తి జాబిల్లి చల్లన కిరణాలతో పూర్తికదూ మనకి.

ఆ రోజుల్లో కన్నమ్మ అమ్మని కన్నమ్మమ్మమ్మ అనడం, ఏకాశికి చిలిమిడికి కొబ్బరికాయలు కోయమంటే చెట్టునుండి పడ్డరోజు జ్ఞాపకం తగని కడుపునొప్పి – నాన్న అడిగితే నూతి దగ్గర పడ్డానని చెప్పాల్సి వచ్చింది – అది విని నువ్వు విరగబడి నవ్వడం యిప్పటికీ జ్ఞాపకం.

నేను ఎన్నో సార్లు వ్రాసేను నువ్వు చాలా హాయిగా బ్రతుకుతున్నావని విశాఖలో. కాని నువ్వు వప్పుకోవు – ఆ కొండలూ, సముద్రం, పాతపడని అందము, కొబ్బరినీడ, సాయంత్రం నీరెండ, వెన్నెట్లో మెరిసే యిసిక కెరటాల మీదుగా నీటి అలల తుంపరలు, హృదయాన్ని ఆకర్షించవు – స్టేషన్ లో నీలి – ఎర్ర దీపాలు, ఏదో భావన అందివ్వడం, సెర్చిలైటులా లైటు హౌసు దీపం, కాంతి చారలూ, మనస్సంతా బాధచేత ఆ తాత్కాలికంగా (మరచి పోయిన) తమ క్షణాల్ని జ్ఞాపకం చేస్తూ మాధుర్యంతో ప్రతిఫలించదూ?

నేనంటే నీకెందుకో ఆ అభిమానం తెలియదు కారణాలు తెలియకుండా కలిసాయి మనసులు– జరిగి పోయిన ఘడియలు వెనక్కి చూసుకుంటే చాలా హాయిగా వుంటాయి. అలాగే మీతో గడిపిన దినాలూనూ.

ఆ తేనెలలో తడిసిన ఆమె పెదాలు, పెదవుల నీడల్లో ఆమె చూపులు జ్ఞాపకానికి వచ్చినప్పుడల్లా, ఇంకా నాకోసం ఫీల్ అవుతుందా, అడ్వైస్ చేస్తుందా, అనిపిస్తుంది. ఆమె మెడ, ఆ జారే ఉంగరాల జుత్తు, మనుపుగా ప్రవాహపు నునుపులా జాకట్టుకింద అందం; మెత్తని ఆమె బుగ్గలు, రెఫ్లెక్ట్ అయే ఆ శరీర కాంతి, కాంతిచానల్లా అగుపడేవి– ఎంతని నా ఆరాటం నీకు రాయను.

ఇదంతా నీకుందా? ఆలోచిస్తావు గాని నీ ఆలోచనకి అర్థం లేదేమో! ‘నేను' అని నువ్వు అనుకున్నప్పుడే ఆ విలువ విలువకట్టేధర మనయిద్దరికీ ఒకటే అనితోస్తే సమస్యే లేదేమో ?

అప్పటి స్నేహాలు వేరుగా అగుపిస్తున్నాయి ఈ రోజుల్లో – నిస్పృహ – నిరాశ సూచించే ఈ దినాలు, సువర్ణాక్షరాలతో లిఖింపబడ్డ ఆ దినాలలో ఓ దీపపు సెమ్మెలా అగుపడుతాయి కదూ.

అస్తమించే శుక్రుడు, గడ్డిమీద మబ్బుబొట్లు, దూరంగా పోయేబళ్ళు, వీచే చలిగాలి, కొండపక్కగా పారే సెలఏరు, తెలియని పిట్టల భాష, ఆమె గడ్డం కిందపడే చిన్న లొత్త, ఎంత అందాన్ని, హాయిని ఇస్తాయి చెప్పు ఆలోచిస్తే –

మనం పొలాల మీదుగా, కాలువ నీటి పక్కగా, నీడల్లోంచి, పోతూ ఒకప్పుడు ‘ల–’ ని వెక్కిరించడం జ్ఞాపకంఉందా– పాపం ఎంత బాధ పడి ఉంటుందో – కాని ఆమెకు అలా అనిపించుకోడం సరదాలేదేమో?

అప్పుడప్పుడు కొండల చాటున, యిసికలో చుట్టూ చల్లని వెన్నెల, పొదల చాటుగ రాత్రి ముద్దుల మ్యూజిక్ లో, కెరటాల డాన్సు చూస్తూ నక్షత్రాల విజిటర్స్ కళ్ళు కప్పుతూ ఓ డ్రై జిన్ తో గడిపిన జీవితంలో అమరసుఖం లేదూ?

‘మీ–’ వదిలిన చోటు బాధిస్తుంది– చిన్న చినుకు, తములపాకులు, పోక చెక్కలు, దోసెట్లే వచ్చిన మల్లె చప్పున మనస్సుకు స్ఫురించి నాలో నేను కుమిలిపోవడం సముదాయించు కోవడమవుతుంది. ఆమె ఒంపుల్ని నవ్వుల్ని నావిగా ఆ రోజుల్లో భావించాను – ఇంక ఆమెను చూసే భాగ్యంలేక విచారించాలి. అందుకే ఆ జ్ఞాపకాలు నీకు వ్రాయడం, రోజులు మారేయి కనుక.

★★★

COMMENTS